క్లుప్తంగా

ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటుకు స్థల పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న ధర్మవరం ఆర్డీఓ మహేష్

బత్తలపల్లి: మండలంలో ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు కోసం ధర్మవరం ఆర్డీఓ మహేష్ స్థల పరిశీలన చేశారు. గురువారం మండల అధికారులు, మండల సర్వేయర్ జోసెఫ్‌తో కలిసి అప్పరాచెరువులోని సర్వే నెంబర్ 98లోని 9 ఎకరాలు, సర్వే నంబరు 99లోని 12 ఎకరాలు ప్రభుత్వ భూమిని పరిశీలించారు. సర్వే నంబర్ 98లోని భూమి అనువుగా ఉందని, సర్వే నంబర్ 99లోని భూమిలో పెద్ద పెద్ద బండ రాళ్ల గుట్టలు ఉన్నాయని వాటిన్నిటిని తొలగించాలంటే ఇబ్బందికరంగా ఉంటుందని అధికారులు ఆర్డీఓ దృష్టికి తీసుకువచ్చారు. ప్రభుత్వం ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటుకు ఒకే చోట కనీసం 20 ఎకరాల వరకు ప్రభుత్వ భూమిని ఎంపిక చేయాలని ఆదేశించడంతో స్థల పరిశీలన చేసినట్లు అధికారులు తెలిపారు.

సీసీరోడ్డు నాణ్యత పరిశీలన



రోడ్డు నాణ్యతను పరిశీలిస్తున్న ఈఈ

కదిరి అర్బన్: మాచిరెడ్డిపల్లిలో నూతనంగా వేస్తున్న సిమెంట్ రోడ్డు నాణ్యతను గురువారం అనంతపురం జిల్లా క్వాలిటీ కంట్రోల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మల్లికార్జున పరిశీలించారు. ఈ సందర్భంగా రోడ్డు మన్నిక వచ్చేలా నాణ్యతతో వేయాలని ఈఈ కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ఉపాధి హామీ నిధులు రూ.7 లక్షల అంచనాతో రోడ్డు వేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈఈ వెంట పంచాయితీ రాజ్ జేఈ మధుసూదన్, ఏఈ గుప్తా ఉన్నారు.

ఏపీయూడబ్ల్యూజే మండల కమిటీ ఎన్నిక



తాడిమర్రి మండల కమిటీ సభ్యులు

తాడిమర్రి: మండల ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు యూనియన్ (ఏపీయూడబ్ల్యూజే) మండల కమిటీ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. స్థానిక లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయ ప్రాంగణంలో గురువారం ధర్మవరం డివిజన్ ఉపాధ్యక్షుడు చందమామ వీరనారప్ప, సహాయ కార్యదర్శి ముసుగు ఆదినారాయణ, కమిటీ సభ్యులు బండారు వెంకటేష్‌ల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. మండల అధ్యక్షుడిగా గుమ్మడం ఓబుళపతి (విశాలాంధ్ర), గౌరవాధ్యక్షులుగా వీరబొమ్మ నాగరాజయ్య (వార్త), ఉపాధ్యక్షులుగా నీరుగంటి వెంకటేష్ (వెటరన్), ప్రధాన కార్యదర్శిగా అగిలే అనంత రెడ్డి, కార్యదర్శిగా కొంకా సాయిప్రభు(ప్రజాశక్తి) లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారికి తోటి విలేకర్లు పూలమాలలు వేసి ఘనంగా శుభాకాంక్షలు తెలిపారు.

విద్యాసామగ్రి పంపిణీ

గాండ్లపెంట: కటారుపల్లికి చెందిన ఉపాధ్యాయుడు శ్రీనివాసులు రెక్కమాను,రెడ్డి వారిపల్లి ఉన్నత పాఠశాలల్లో గురువారం ఎంఈఓ కృష్ణానాయక్ ఆధ్వర్యంలో విద్యార్థులకు విద్యాసామగ్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ ఉపాధ్యాయుడు శ్రీనివాసులు ఏటా తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం విద్యాసామగ్రి పంపిణీ చేస్తున్నారన్నారు. రెక్కమాను హెచ్‌ఎం ఆదినారాయణ, ఉపాధ్యాయులు నరేంద్ర, క్రిష్టారెడ్డి, ఫిరోజ్, ఆనందరెడ్డి, పార్వతమ్మ, మస్తాన్ పాల్గొన్నారు.

విదేశీ భక్తుల ఔదార్యం

నల్లమాడ: సత్యసాయి బాబా 99వ జయంత్యుత్సవాలను పురస్కరించుకొని స్థానిక షిర్డీసాయి మందిర ప్రాంగణంలో గురువారం నెదర్లాండ్‌కు చెందిన సాయి భక్తులు మహిళలు, చిన్నారులకు దుస్తులు పంపిణీ చేశారు. భక్తులు మాట్లాడుతూ సత్యసాయి బాబా స్ఫూర్తితో 500 మహిళలకు చీరలు, 200 మంది చిన్నారులకు దుస్తులు పంపిణీ చేసినట్లు తెలిపారు. అనంతరం పెద్ద ఎత్తున అన్నదానం చేపట్టారు.

పేరూరులో కనకదాస జయంతి



కనకదాస చిత్రపటాన్ని ఊరేగిస్తున్న దృశ్యం

రామగిరి: పేరూరులో భక్త కనకదాస జయంతిని గురువారం ఘనంగా జరుపుకున్నారు. మహిళలు బోనాలను వీధుల్లో ఊరేగించారు. బస్టాండ్ వద్ద కనకదాస చిత్రపటానికి పూజలు చేపట్టారు. గొరవయ్యల నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. లక్ష్మీనారాయణ రెడ్డి, పాటిల్ తిమ్మారెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, ఈశ్వరప్ప, రామాంజనేయులు, మారెన్న, సన్నాయప్ప, ముత్యాలు పాల్గొన్నారు.

మరుభూమి.. కష్టాలు కనరేమి?

- ఆరడుగుల స్థలం లేక అష్టకష్టాలు
- కుచించుకుపోయిన శ్మశాన వాటిక
- అధికారులకు విన్నవించినా ఫలితం శూన్యం



బత్తలపల్లిలో శ్మశాన వాటిక



స్థలం లేకపోవడంతో ఇరుకుగా ఉన్న సమాధులు

బత్తలపల్లి: మండల కేంద్రం బత్తలపల్లిలో ఎవరైనా చనిపోతే శవం పూడ్చడానికి బంధువులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. శ్మశాన స్థలం కుచించుకుపోవడం.. తవ్విన చోట ఒకటి, రెండు పుర్రెలు, అస్థిపంజరాలు బయటపడడం.. గత్యంతరం లేక శవంపైనే మరో శవం పూడ్చాల్సి రావడం విషాదకరం. గ్రామం ఏర్పడినప్పుడు శవాలను పూడ్చేందుకు 1.47 ఎకరాల స్థలం ఉండేది. ఆ స్థలం రానురాను ఆక్రమణలకు గురై ఎకరాకు కుచించుకుపోయింది. రోడ్డు విస్తరణ జరిగితే అది కూడా ఉండదని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రంలో 25వేల జనాభా ఉంది. శ్మశానవాటికలో కొంత స్థలం సమాధులతో నిండిపోయింది. మిగిలిన కొద్దిపాటి స్థలంలోనే ఖననం చేస్తున్నారు. జనాభాకు అనుగుణంగా శ్మశానవాటిక విస్తీర్ణం కనీసం మూడు ఎకరాలు ఉండాలి. ఆ మేరకు ఊరికి దూరంగా మూడు ఎకరాల స్థలం కేటాయించాలని తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నాలు, నిరసనలు చేపట్టారు. ఆర్డీఓ, జాయింట్ కలెక్టర్, కలెక్టర్‌ను కలిసి వినతిపత్రాలూ అందజేశారు. మంత్రి సత్యకుమార్ దృష్టికి తీసుకెళ్లి పరిస్థితి వివరించారు. ఎంత మందికి మొరపెట్టుకున్నా శ్మశాన వాటికకు స్థలం కేటాయింపు అంశం ముందుకు కదలలేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అంత్యక్రియలకు అవస్థలు



చనిపోయిన వారి అంత్యక్రియలు చేయడానికి చాలా ఇబ్బందులు పడుతున్నాం. శ్మశానంలో ఆరడుగుల స్థలం దొరకడం లేదు. ఉన్న కొద్దిపాటి స్థలంలోనే శవాలు పూడ్చడం ఇబ్బందికరంగా ఉంది. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి శ్మశాన వాటికకు మూడు ఎకరాల స్థలం కేటాయించాలి.

–బ్రహ్మయ్య, బత్తలపల్లి

దుర్వాసన వస్తోంది



ఊరికి దూరంగా శ్మశానవాటిక ఏర్పాటు చేయాలి. జనాభా పెరుగుతూ పోతోంది. ఎన్నాళ్లని శవంపై శవం పూడ్చి పెట్టుకుంటూ వెళ్లాలి? వర్షం పడితే శ్మశానంలో కాలు కూడా పెట్టే పరిస్థితి లేదు. చాలా చాలా దారుణంగా ఉంటుంది. శవాలను తవ్వి.. మరో శవం పూడ్చాలంటే దుర్వాసన వస్తోంది. శ్మశాన సమస్య తీర్చాలి.

–ఆదెప్ప, బత్తలపల్లి

ఎందుకంత తాత్సారమో?



బత్తలపల్లిలో శ్మశాన వాటికకు స్థలం కేటాయించాలని గ్రామస్తులతో కలిసి తహసీల్దార్ కార్యాలయం ముందు ఆందోళనలు చేపట్టాం. తహసీల్దార్ వచ్చి శ్మశాన వాటికను పరిశీలించారు. ఆ తరువాత ఎటువంటి చర్యలూ తీసుకోలేదు. జిల్లా అధికారులకు, ప్రజాప్రతినిధులకు విన్నవించాం. ఎందుకు తాత్సారం చేస్తున్నారో తెలియడం లేదు. – కాటమయ్య, ఏపీ రైతు సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్

చర్యలు చేపడతాం



మండల కేంద్రమైన బత్తలపల్లిలో శ్మశాన వాటికకు స్థలం కేటాయించే విషయమై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా. గతంలో అర్జీలు ఇచ్చిన విషయం తెలిసింది. ఇప్పటికిప్పుడు సమస్య పరిష్కారం కాదు. ఉన్నతాధికారులతో చర్చించి సమస్యపై సరైన నిర్ణయం తీసుకుంటాం. శ్మశాన వాటికను ఆక్రమించుకుని ఉంటే చర్యలు తీసుకుంటాం.

–స్వర్ణలత, తహసీల్దార్, బత్తలపల్లి

వైఎస్ జగన్‌ను కలిసిన మాజీ సర్పంచ్



వైఎస్ జగన్‌తో రవికుమార్‌రెడ్డి

నల్లచెరువు: మండల కేంద్రానికి చెందిన వైఎస్సార్ సీపీ నేత, నల్లచెరువు మాజీ సర్పంచ్ మొండెం రవికుమార్‌రెడ్డి గురువారం తాడేపల్లిలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వ పాలనతో ప్రజలు పడుతున్న ఇబ్బందులను మాజీ సీఎం దృష్టికి తీసుకెళ్లినట్లు మాజీ సర్పంచ్ తెలిపారు.

కలెక్టరేట్ వద్ద ధర్నా జయప్రదం చేయండి

గాండ్లపెంట: రైతు సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 26న పుట్టపర్తి కలెక్టరేట్ వద్ద తలపెట్టిన ధర్నాను విజయవంతం చేయాలని రైతు సంఘం నాయకులు కోరారు. ఈమేరకు గురువారం ధర్నాకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం నాయకులు బడా సుబ్బిరెడ్డి మాట్లాడుతూ పాడి రైతుకు గిట్టుబాటు ధర కల్పించడంతోపాటు లీటరుకు రూ.5 సబ్సిడీ చెల్లించాలన్నారు. గొర్రెలు, మేకలకు ఉచితంగా మందులు అందించాలన్నారు. ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు. ఉపాధి హామీ కూలీలకు ఏడాదికి 200 పనిరోజులు కల్పించడంతో పాటు రోజుకు రూ.600 వేతనం అందించాలని డిమాండ్ చేశారు.

సమస్యలను గ్రామసభ దృష్టికి తీసుకురండి



గ్రామస్తులతో అర్జీలను స్వీకరిస్తున్న డిప్యూటీ తహసీల్దార్ షణ్ముఖ కుమార్

బత్తలపల్లి: ప్రజలు తమ సమస్యలను గ్రామసభల దృష్టికి సమస్యలను తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని డిప్యూటి తహసీల్దార్ షణ్ముఖ కుమార్‌యాదవ్ సూచించారు. గురువారం ఈదుల ముష్టూరు గ్రామంలో సర్పంచు ముసలప్ప అధ్యక్షతన గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటి తహసీల్దార్ మాట్లాడుతూ ప్రతి రెవెన్యూ గ్రామంలో ప్రజా సమస్యల పరిష్కారానికి గ్రామసభలు నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం గ్రామస్తులతో అర్జీలను స్వీకరించారు. గ్రామపెద్దలు లాయర్ కరణం సూర్యప్రకాష్‌రావు, వీఆర్‌ఓ ముత్యాలన్న, కార్యదర్శి శ్రీనివాసులు, గ్రామ సర్వేయర్ విజయ్, ఈదుల ముష్టూరు, సంజీవపురం గ్రామస్తులు పాల్గొన్నారు.

తనకల్లు: ఇళ్లు లేని నిరుపేదలకు ఇంటి స్థలాలను మంజూరు చేయాలని కాంగ్రెస్ మండల కన్వీనర్ తోపు పారేసు కోరారు. ఈ మేరకు గురువారం చీకటిమానిపల్లిలో నిర్వహించిన గ్రామసభలో అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ టీడీపీ ఎన్నికల హామీలో భాగంగా పేదలకు మూడు సెంట్లు ఇంటి స్థలాన్ని వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఇంటి స్థలంతో పాటు ఉచితంగా ప్రభుత్వమే ఇంటి నిర్మాణాలను చేపట్టాలన్నారు. కార్యక్రమంలో నాయకులు నరసింహులు, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

పిల్లలకు నైతిక విలువలు నేర్పాలి



కిశోరి వికాసం పోస్టర్లు ఆవిష్కరిస్తున్న అధికారులు

పుట్టపర్తి అర్బన్: పిల్లలకు నైతిక విలువలను నేర్పాల్సిన బాధ్యత తల్లిదండ్రులదేనని పుట్టపర్తి ఆర్డీఓ సువర్ణ పేర్కొన్నారు. గురువారం పుట్టపర్తి సమీపంలోని సంస్కృతి విద్యాసంస్థల్లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన కిశోర బాలికల వికాసంపై శిక్షణా కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఐసీడీఎస్ పీడీ సుధావరలక్ష్మి, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, డీపీఓ సమత, జిల్లా రిసోర్స్‌పర్సన్ మహేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ కిశోర బాలికలకు ఎక్కడ ఎలా ఉండాలనే విషయాలను నేర్పించాలన్నారు. ఐసీడీఎస్ పీడీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ విద్యావంతులుగా ఎదగాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్యం, బాల్య వివాహాలు, లైంగిక దాడులు, ఆత్మరక్షణ, అక్రమ రవాణ వంటి అంశాలపై అవగాహన ఉండాలన్నారు. వీటిపై రిసోర్స్ గ్రూపు సభ్యులు మండల, గ్రామ స్థాయిలో శిక్షణ ఇస్తారన్నారు. వెలుగు ఏపీఎంలు, సీడీపీఓలు, ఎంపీడీఓలు, ఈఓఆర్డీలు, జూనియర్ కళాశాల ప్రిన్సిపాళ్లు, లెక్చరర్స్, మహిళా పోలీసులు, ప్రొటెక్షన్ ఆఫీసర్లు మురళీధర్, నాగలక్ష్మి, డాక్టర్ నరేష్‌కుమార్ ఈఓఆర్డీ నాగమణిబాయి తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తికి తీవ్ర గాయాలు

తనకల్లు: మండలంలోని నల్లగుట్లపల్లి సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓవ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. పెనుకొండకు చెందిన శ్రీనివాసులు స్వగ్రామానికి బైక్‌పై బయలుదేరాడు. ఘటనాస్థలంలో కుక్క అడ్డురావడంతో అదుపుతప్పి కిందపడ్డాడు. ఘటనలో తీవ్రంగా గాయపడిన అతడిని వందేమాతరం టీం ఉచిత అంబులెన్స్‌లో తనకల్లు ప్రభుత్వాసుపత్రికి తరలించింది.

ఘనంగా విగ్రహ ప్రతిష్ట

ముదిగుబ్బ: ఉప్పాలపాడు గ్రామంలో గురువారం అభయాంజనేయస్వామి, వినాయకస్వామి, సాయిబాబా, పెద్దమ్మతల్లి ఘనంగా ప్రతిష్ట ఘనంగా జరిగింది. ఉదయం నుంచి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పొన్నూరు నీలకంఠారెడ్డి, సర్పంచ్ లక్ష్మినారాయణమ్మల ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. భక్తులు స్వామివార్లను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

అపరిచితులతో అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న ఎస్‌ఐ కృష్ణవేణి

తాడిమర్రి: అపరిచితుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ కృష్ణవేణి బాలికలకు సూచించారు. స్థానిక కస్తూర్బా బాలికా విద్యాలయంలో గురువారం ఆమె విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్‌లపై అవగాహన కల్పించారు. సెల్‌ఫోన్ ద్వారా జరిగే మంచి, చెడులను వివరించారు. కొందరు దుర్మార్గులు చెడు ప్రవర్తించడానికి ప్రయత్నిస్తారని, అలాంటి వారి పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. ఉపాధ్యాయినులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ మరుగుదొడ్డి తప్పనిసరి



నల్లచెరువులో ర్యాలీ నిర్వహిస్తున్న దశ్యం

నల్లచెరువు: గ్రామాల్లో ప్రతి ఇంటికీ మరుగుదొడ్డి తప్పనిసరిగా నిర్మించుకోవాలని స్వచ్ఛ భారత్ రీసోర్స్ కో ఆర్డినేటర్ విశ్వేశ్వర తెలిపారు. అంతర్జాతీయ మరుగుదొడ్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు మరుగుదొడ్లపై అవగాహన కల్పించారు. విద్యార్థులు, పారిశుద్ధ్య కార్మికులతో కలిసి పాఠశాల నుంచి వైఎస్సార్ కూడలి వరకూ మరుగుదొడ్లపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వేశ్వర మాట్లాడుతూ వ్యక్తిగత మరుగుదొడ్లు, కమ్యూనిటీ మరుగుదొడ్ల వాడకంపై డిసెంబర్ 10వ తేదీ వరకూ అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు.ఈఓ ఆర్డీ శకుంతల, పంచాయతీ కార్యదర్శి నరేష్, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

తలుపుల : స్థానిక ఎంపీడీఓ కార్యాలయం నుంచి ఎంఈఓ వెంకట్రాముడు ఆధ్వర్యంలో గురువారం జాతీయ మరుగుదొడ్ల దినోత్సవంపై విద్యార్థులు, అంగన్‌వాడీ కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. వ్యక్తిగత మరుగుదొడ్లను విస్మరించవద్దు, అనారోగ్యాల పాలు కావద్దు అంటూ నినాదాలు చేశారు. ర్యాలీలో సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్పీకుంట: బహిరంగ మలవిసర్జన సామాజిక దురాచారమని ఎంపీడీఓ ఆంజినప్ప పేర్కొన్నారు. ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవం సందర్భంగా గురువారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యక్తిగత మరుగుదొడ్ల వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈఓపీఆర్డీ మాధవరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దాడులకు పాల్పడితే సహించేది లేదు

- మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి



కొడపగానిపల్లిలో భాదితులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి



మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

పుట్టపర్తి టౌన్: కొత్తచెరువు మండల వ్యాప్తంగా వైఎస్సార్‌సీపీ శ్రేణులపై టీడీపీ నేతల దాడులు ఎక్కువయ్యాయని, దాడులకు పాల్పడితే సహించమని మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి హెచ్చరించారు. కొత్తచెరువు మండలం కొడపగానిపల్లికి చెందిన వినోద్ కుమార్‌రెడ్డి, నరేంద్రరెడ్డి, హరిని సోషియల్ మీడియాలో యాక్టివ్‌గా ఉన్నారని కొత్తచెరువు నెహ్రూ సర్కిల్‌లో టీడీపీ ముఖ్యనేత శ్రీనివాసులు సమక్షంలో పోలీసులు ఎదురుగా కర్రలతో దాడి చేసిన సంగతి తెలిసిందే. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే గురువారం గ్రామంలోని క్షతగాత్రుల నివాసాలకు వెళ్లి పరామర్శించారు. ధైర్యం చెప్పి అండగా ఉంటామని హామీ ఇచ్చి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు పుట్టపర్తి నియోజకవర్గంలో ఎప్పుడు ఇలాంటి దాడులు జరగలేదని, ప్రజలకు మంచి చేశామన్నారు. కూటమి ప్రభుత్వం అధికాంలోకి వచ్చినప్పటి నుంచి సోషల్ మీడియా యాక్టివ్‌గా ఉన్న యువకులపై దాడులు చేస్తున్నారన్నారు. ప్రజలకు సుపరిపాలన అందించి వారి మన్నలు పొందాలని, కాని ఇలాంటి దాడులు చేసి భయభ్రాంతులకు గురి చేయడం సరికాదని హితవు పలికారు. సర్పంచ్ నరసింహారెడ్డి, మాజీ సింగల్ విండో అధ్యక్షుడు శ్యామ్ సుందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ రఘునాథరెడ్డి, కొత్తచెరువు సర్పంచ్ భర్త నాగరాజు పాటు వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

నల్లమాడ: కొండ్రవారిపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత రైతు ఎం.సుధాకర్‌రెడ్డి (52) కొన్ని రోజుల క్రితం పురుగుల మందు సేవించి ఆత్మహత్యకు పాల్పడి మృతిచెందిన విషయం తెలిసిందే. మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి గురువారం గ్రామానికి చేరుకుని మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ధైర్యంగా ఉండాలని వైఎస్సార్ సీపీ అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కే. సూర్యనారాయణ, బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు పొరకల రమణ, మండల పరిశీలకులు బీఆర్ కేశప్ప, ఎంపీటీసీ శివారెడ్డి, నాయకులు దుద్దుకుంట వెంకటరెడ్డి, రఫీ, దుద్దుకుంట శ్రీనివాస రెడ్డి, బెల్లం రంగారెడ్డి, షంషీర్, చంద్రహాసరెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, కేశవరెడ్డి తదితరులున్నారు.

శుభకార్యం

ఓడీచెరువు: కొండకమర్ల గ్రామానికి చెందిన నయిమ్‌బాషా(భట్టు) కుమారుడు అబుజర్, అప్సానా నూతన దంపతులను మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి గురువారం ఆశీర్వదించారు. అంతకముందు ఆయన అదే గ్రామానికి చెందిన ఎద్దుల సతీష్‌రెడ్డి గృహప్రవేశంలో పాల్గొన్నారు. అనంతరం గొల్లపల్లికి చెందిన వెంకటరెడ్డి గృహ ప్రవేశానికి హాజరయ్యారు. సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు రామసుబ్బారెడ్డి, వైఎస్సార్‌సీపీ టౌన్ కన్వీనర్ కోళ్ల క్రిష్టారెడ్డి, చింతమానిపల్లి సర్పంచ్ జగన్‌మోహన్‌చౌదరి, లక్ష్మిరెడ్డి, గోవర్ధన్ రెడ్డి, కుర్లి నరిసిరెడ్డి, రంగారెడ్డి, వెంకటరంగారెడ్డి, ఇద్దే భాస్కర్ రెడ్డి, ఎస్సీసెల్ మండల కన్వీనర్ రామంజి తదితరులు పాల్గొన్నారు

బాధితుడికి పరామర్శ

ఇనగలూరుకు చెందిన లక్ష్మినారాయణ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి ఇంటి వద్ద విశాంత్రి తీసుకుండగా ఆయన్ను మాజీ ఎమ్మెల్యే పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని మాజీ ఎమ్మెల్యే ఆకాంక్షించారు.

మహిళకు పాముకాటు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని ఎర్రగుంటకు చెందిన చాకలి లక్ష్మమ్మ గురువారం ఉదయం ప్రియాంకనగర్ సమీపంలోని చెరువు వద్ద బట్టలు ఉతుకుతుండగా ప్రమాదవశాత్తు పాము కరిచింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ఆమెను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు.

ధర్మవరం రూరల్: మల్లేనిపల్లికి చెందిన రాములమ్మ అనే మహిళా రైతు గురువారం వ్యవసాయ పనులు చేసుకుంటుండగా పాము కాటుకు గురైంది. తోటి కూలీలు గమనించి రాములమ్మను ధర్మవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన చికిత్స కోసం అనంతపురం తీసుకెళ్లారు.

ముదిగుబ్బ ఎస్‌ఐగా ఇషాక్ బాషా



ముదిగుబ్బ: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐగా ఇషాక్‌బాషా గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఫ్యాక్షన్ గ్రామాలపై నిఘా ఉంచి శాంతిభద్రతలను పరిరక్షిస్తానన్నారు. మండల కేంద్రంలో ట్రాఫిక్ సమస్యను పరిష్కరిస్తామన్నారు. ప్రజల సహకారంతో మండలంలో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్టవేస్తామన్నారు.

తపాల కార్యాలయాల్లో ఖాతాలు తెరవండి

గాండ్లపెంట: గ్రామీణ ప్రజలకు కేంద్ర, రాష్ట్ర

సంక్షిప్త సమాచారం

ప్రభుత్వాలు అందించే సంక్షేమ పథకాల కోసం సమీప తపాలా కార్యాలయాల్లో ఖాతాలు ప్రారంభించవచ్చని కదిరి డివిజనల్ తపాలా ఇన్‌స్పెక్టర్ గోవర్ధన్‌నాయక్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఐపీపీబీలో ఖాతాలు తెరిస్తే సంక్షేమ, సబ్సిడీ పథకాల నగదు, ఉపాధి హామీ వేతనాలు అందులో జమ చేస్తారన్నారు. కేవలం రూ.200కే ఖాతాను ప్రారంభించవచ్చని తెలిపారు. ఖాతాలు ప్రారంభించేందుకు శుక్రవారం గాండ్లపెంట గ్రామ సచివాలయంలో శిబిరం ఏర్పాటు చేస్తామన్నారు.

వీధిదీపాలు ఏర్పాటు చేయాలని వినతి

నల్లమాడ: మండల కేంద్రంలో వీధి దీపాలు ఏర్పాటు చేయాలని కోరుతూ సీపీఐ ఆధ్వర్యంలో గురువారం పంచాయితీ కార్యదర్శి విశ్వనాథరెడ్డికి వినతిపత్రం అందజేశారు. సీపీఐ మండల కార్యదర్శి వెంకటరమణ మాట్లాడుతూ వీధి దీపాలు లేకపోవడంతో రాత్రి వేళల్లో రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. నాయకులు వెంకటరమణ, గంగాధర్, మహేష్ పాల్గొన్నారు.

సామాజిక తనిఖీ బృందం సమావేశం

తాడిమర్రి: ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం ఉపాధిహామీ పనుల సామాజిక తనిఖీ బృందం సమన్వయ సమావేశం నిర్వహించారు. ఏపీఓ సంజీవరెడ్డి మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం అనుసంధానంతో జరిగిన పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించాలన్నారు. ఈసీ అశోక్‌కుమార్‌రెడ్డి, సాంకేతిక, క్షేత్ర సహాయకులు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ముదిగుబ్బ: తమ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాని పంచాయతీ పారిశుధ్య కార్మికులు డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలో కార్మికులు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలన్నారు. కార్మికులు ఆటో పెద్దన్న, బండల వెంకటేష్, బాబ్‌జాన్, నీషాద్ పాల్గొన్నారు.

నివాళి

నల్లచెరువు: మండల కేంద్రంలో నివాసముండే వైఎస్సార్‌సీపీ కార్యకర్త అగ్గేరి వెంకట నారాయణ(45) బుధవారం అర్ధరాత్రి గుండెపోటుతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి దశరథనాయుడు, సర్పంచ్ పంచ రత్నమ్మ, ఎంపీటీసీ లక్ష్మిదేవి గురువారం వెంకటనారాయణ మృత దేహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. నాయకులు ఉత్తన్న, అల్లాపల్లి రామాంజనేయులు, శేఖర్‌రెడ్డి, బాబూరెడ్డి, రామాంజినేయులు. చిన్న రెడ్డెప్ప తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

పుట్టపర్తి టౌన్: బొంతలపల్లి క్రాస్ వద్ద ఎక్సైజ్ పోలీసులు గురువారం దాసునాయక్ అనే వ్యక్తి నుంచి 30 కర్ణాటక టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. సీఐ నాగరాజు, ఎస్‌ఐ ఉమామనోహర్‌రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

పంటకోత ప్రయోగాలు

తనకల్లు: మార్పురివాండ్లపల్లిలో జనజాగృతి సంస్థ సహకారంతో సాగు చేసిన కొర్ర పంటలో గురువారం ఏఓ శ్రీహరినాయక్ ఆధ్వర్యంలో పంట కోత ప్రయోగాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ కొర్ర పంటలో చేపట్టిన పంటకోత ప్రయోగంలో మంచి దిగుబడి వచ్చిందన్నారు. బీడు భూముని సారవంతమైన భూములుగా మర్చేందుకు ఘన, ద్రవ జీవామృతాలు వినియోగించడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో జనజాగృతి సంస్థ కార్యకర్తలు శ్రీనివాసులురెడ్డి, గరుడప్ప, సుప్రియ, విశ్వనాథ్, ధరణీ, ఆత్మ మండల అధికారి మౌనిక, గ్రామ వ్యవసాఆయధికారి చిన్నప్ప, రైతులు పాల్గొన్నారు.

పోలీసుల శ్రమదానం

చెన్నేకొత్తపల్లి: ఎన్ఎస్ గేట్ నుంచి ధర్మవరానికి వెళ్లే ప్రధాన రహదారిలో నాగసముద్రం బస్టాండ్ సమీపంలో, చందమూరు వరకు రోడ్డు గుంతలమయంగా మారడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురయ్యారు. ఒకరిద్దరు ప్రాణాలు కోల్పోయారు. విషయం తెలుసుకున్న పోలీసులు గురువారం శ్రమదానం చేసి, గుంతలను మట్టితో పూడ్చారు. ఎస్ఐ సత్యనారాయణ చొరవతో హెడ్‌కానిస్టేబుల్ రఘునాథ్, కానిస్టేబుల్ అమరనాథ్‌తో కలసి గుంతల్లో రాళ్లు, మట్టి వేశారు. వాహనాలు వెళ్లేందుకు వీలుగా చర్యలు తీసుకున్నారు.